క్లుప్తంగా

వార్డు ఎన్నికలకు సిద్ధం

కోట: మండలంలో ఖాళీగా ఉన్న రెండు వార్డులకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న క్రమంలో ఎంపీడీఓ భవాని మంగళవారం ఆయా గ్రామాల్లో ఏర్పాట్లు పరిశీలించారు. వార్డు సభ్యులు మరణించడంతో ఖాళీగా ఉన్న కేసవరం పంచాయతీ పరిధిలో 5వ వార్డు, ఉత్తమనెల్లూరు పరిధిలో 3వ వార్డుకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. కేసవరం 5వ వార్డు పరిధిలో 208 మంది ఓటర్లు, ఉత్తమనెల్లూరు 3వ వార్డు పరిధిలో 93 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా పరిశీలనతో పాటు పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించి సూచనలు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

నాయుడుపేట: శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు రేషన్ బియ్యం బస్తాల లోడుతో వెళుతున్న వాహనాన్ని విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణనాయక్, సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్య మంగళవారం పట్టుకున్నారు. పట్టణంలోని అగ్రహారంపేట వద్ద రహదారిపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి బియ్యం లోడుతో వెళుతున్న టాటా ఏస్ వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో రేషన్ బియ్యం 46 బస్తాలు(8587 కేజీలు) ఉండడాన్ని గుర్తించి వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ మురళిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు డీటీ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని మామిడి కాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తెల్లవారుజామున ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. సర్కిల్ పరిధిలో గస్తీ నిర్వహిస్తుండగా మామిడి కాలువ డొంక వద్ద ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఓజిలి మండలం ఇనుగుంట గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ టి. చెంచుకృష్ణయ్యను పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్ఈబీ పోలీసులు వెంకటయ్య, వెంకటేశ్వర్లు, తిరుమలరావు పాల్గొన్నారు.

ఆశ్రిత చారిటబుల్ ట్రస్టు మహిళా దినోత్సవం

సూళ్లూరుపేట: పట్టణంలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాలలో ఆశ్రిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేట పట్టణం, పరిసర ప్రాంతాల్లో గత పది సంవత్సరాలుగా వృద్ధులకు, నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్న ఆశ్రిత చారిటబుల్ ట్రస్టు ఎవరి నుంచి సాయం అందుకోకుండా తను సంపాదించిన దాంట్లో నుంచి కొంత నగదును నిల్వ చేసి నిరుపేదలకు సాయం అందిస్తున్న సంస్థగా పేరు ఉంది. సంస్థ వ్యవస్థాపకురాలు ఎం విజయకుమారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా 30 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. అనంతరం టీచర్‌గా పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన కృష్ణవేణి–హనుమంతరావు దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలను నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. అలాగే షార్ కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు అర్లప్ప ట్రస్ట్‌కు పదివేలు విరాళాన్ని కూడా ఆమె అందజేశారు. ఇకనుంచి క్యాన్సర్ పేషెంట్లకు సాయం అందించాలని నిర్ణయించి మంగళవారం సుహాసిని అనే క్యాన్సర్ పేషెంట్‌కు విజయకుమారి ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంచల ఉషారాణి, అరుణ, రుక్మిణి, విజయమ్మ, విజయజ్యోతి పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

దొరవారిసత్రం : ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కుప్పారెడ్డిపాళెం గ్రామ సమీపం, వెదురుపట్టు గ్రామ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. దొరవారిసత్రం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (35) సొంత పనిమీద వెదురుపట్టు గ్రామ రోడ్డు వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో అటుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. క్షతగాత్రుడ్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు : మండలంలోని వరగలి క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఏరూరు అల్లీపురం గ్రామానికి చెందిన ఫణి, గీత బైక్‌పై సైదాపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పరీక్ష రాసేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో వారు వెళుతున్న బైక్‌ను ఆటో ఢీకొంది. క్షతగాత్రులను 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఫణి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను సాధిస్తాం

- జగనన్న సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు
- తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



భారీ గజమాలతో నేదురుమల్లిని సత్కరిస్తున్న నేతలు



మాట్లాడుతున్న రాంకుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

డక్కిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో డక్కిలి మండలాన్ని సస్యశ్యామలం చేసే ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను సాధిస్తామని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. డక్కిలిలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశానికే దిక్సూచిలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామిక వేత్తల సదస్సులో రూ.13లక్షల కోట్లకుపైగా విలువైన పరిశ్రమల స్థాపనకు పారిశ్రామిక వేతలు ముందుకు రావడం చారిత్రాత్మకమైనదని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం రాజధాని నిర్మాణం నుంచి పరిశ్రమల స్థాపన వరకు త్రీడీ ఎఫెక్ట్‌లో గ్రాఫిక్స్‌లో మాత్రమే చూపారని విమర్శించారు. ఈనెల 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ నేదురుమల్లి నాయకత్వంలో వెంకటగిరి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అంతకుముందు డక్కిలి కమ్మపల్లి రోడ్డు సెంటర్ నుంచి భారీ ర్యాలీ జరిగింది. క్రేన్‌తో ఏర్పాటు చేసిన భారీ గజమాలతో నేదురుమల్లిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డక్కిలి జెడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ కన్వీనర్ చింతల శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ గడ్డం సుధీర్‌రెడ్డి, పాదిలేటి దశరథరామిరెడ్డి, తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, జయంపు సొసైటీ అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, నేతలు మల్లికార్జున్‌రెడ్డి, కె.వేణు, లక్ష్మీనారాయణరెడ్డి, ఎం మునిరామిరెడ్డి, ఆలయ చైర్మన్ ప్రకాశం నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి



చిలమానుచేనులో పట్టభద్రులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు



చిల్లకూరులో డీసీసీబీ చైర్మన్, ఎంపీపీ

గూడూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి, జగనన్నకు కానుకగా ఇద్దామని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. పట్టణంలోని గమళ్లపాళెం, కృష్ణమందిరం, ఇందిరనగర్, జానకిరాంపేట ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం కల్యాణ్ చక్రవర్తి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నేతలు బత్తిని విజయ్‌కుమార్, మూలి కిషోర్‌రెడ్డి, కందాటి రాఘవరెడ్డి, అన్నం మురళి, దాసరి వెంకటేశ్వర్లు, నరసయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఓజిలి: మండల పరిధిలోని చిలమానుచేను, ఆర్మేనిపాడు గ్రామాల్లోని సచివాలయాలు, ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే చిలమానుచేను గురుకుల పాఠశాల, వాకాటివారంకండ్రిగలో ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. సీజేఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా, నేతలు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరనాథ్‌రెడ్డి, ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సుబ్బరాయులు, సచివాలయ కన్వీనర్ మురుగేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విజయాన్ని కానుకగా ఇద్దాం

పెళ్లకూరు: వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఎమ్మెల్సీ విజయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చిల్లకూరు, వడ్డిపాళెం గ్రామాల్లో పర్యటించిన ఆయన ఉపాధ్యాయ, పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యతా ఓటు వేయలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కుమార్, సచివాలయ కన్వీనర్ రఘునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సతీష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కోలాహలంగా హోలీ వేడుకలు



రంగులు చల్లుకుంటున్న మార్వాడీలు

నాయుడుపేటటౌన్ : హోలీ పండుగను మంగళవారం మార్వాడీలు, జైనులు కోలాహలంగా జరుపుకున్నారు. చిన్నారులతో పాటు మహిళలు, పెద్దలు, యువత సైతం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు అపార్టుమెంట్ల వద్ద హోలీ పండుగ వేడుకలను కోలాహలంగా జరుపుకున్నారు. మేనకూరు సెజ్ పరిధిలోని పలు పరిశ్రమల వద్ద అక్కడి కార్మికులతో పాటు యాజమాన్య ప్రతినిధులు, హోలీపండుగ వేడుకలను రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

సత్తాచాటిన ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ

కోట: జేఎన్‌టీయూఏ అంతర కళాశాలల క్రీడాపోటీల్లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మూడురోజుల పాటు అంతర కళాశాలల క్రీడలు జరగగా ఎన్‌బీకేఆర్ విద్యార్థులు ఏడు విభాగాల్లో విజేతలుగా నిలిచారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజయకుమార్‌రెడ్డి అభినందించారు. పీడీ మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సీఐ

గూడూరు: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా లింగ సమానత్వం కోసం, ఆవిష్కరణ, సాంకేతికత అనే అంశంపై మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈబీ ఎస్ఐ శేషమ్మ పాల్గొన్నారు.

ఘనంగా మహాచండీయాగం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం మహాచండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకారం చేసి ఆలయం ఆవరణలోని యాగశాలలో వేద పండితులు వేదమంత్రాలతో యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగం అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి

- పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

కోట: వైఎస్సార్‌సీపీ కోట మండల ఆత్మీయ సమావేశం మంగళవారం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్ పార్టీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కోట మండలానికి చెందిన నన్ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దీవెనలతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టారు. మీ ఇంటి బిడ్డగా మీరు ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజాసేవ చేసుకుంటానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. కొడవలూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ జగనన్న నిలబెట్టిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా పార్టీ శ్రేణులు కృషిచేయాలన్నారు. కోట ఎంపీపీ దాసరి అంజమ్మ, పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, షనీల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, జెడ్పీటీసీ కోటయ్య, చేవూరు నాగేశ్వరరావు, నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



కుమ్మరవీధిలో పరిశీలిస్తున్న కమిషనర్

గూడూరు: మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ హెచ్చరించారు. పట్టణంలోని కుమ్మరవీధి ప్రాంతాల్లో ఆయన టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కుమ్మరవీధిలో ఆక్రమణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. దుకాణదారులు మురుగు కాలువలపై కూడా నిర్మాణాలు చేపట్టారన్నారు. కుమ్మరవీధి ఆక్రమణలతో ఇరుగ్గా మారిందన్నారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయన్నారు. ఈ సమస్యపై రాతపూర్వకంగా కొంతమంది ఫిర్యాదు అందజేశారన్నారు. ఈమేరకు తాము టౌన్ ప్లానింగ్ అధికారితో కలిసి పరిశీలించామని తెలిపారు. పలు చోట్ల మున్సిపల్ స్థలాల్లో వ్యర్థాలను నిల్వ చేసి ఉండగా, వారితో కమిషనర్ మాట్లాడి, త్వరగా వాటిని తొలగించాలని హెచ్చరించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



బాలాయపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఎంపీడీఓ స్వరూప పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బాలాయపల్లిలో పొదుపు మహిళలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గోపాల్

చిల్లకూరు: సమాజంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను తెలుసుకోవాలని చిల్లకూరు ఎస్ఐ గోపాల్ తెలిపారు. చిల్లకూరులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్, వైఎస్సార్‌క్రాంతి పథం, మహిళా పోలీసులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి మహిళా వారి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గున్నయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రేణుక, శివజ్యోతి, మహిళా పోలీసులు స్వర్ణ, శాంతి, సంఘబంధం అధ్యక్షురాలు విజిత పాల్గొన్నారు.

ఎన్నికల అభ్యంతరాలపై సమావేశం



మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరావు

చిల్లకూరు: మండలంలోని ఓడూరు సెగ్మెంట్‌కు సంబంధించి ఎంపీటీసీ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించే క్రమంలో మంగళవారం మండలంలోని అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశానికి అన్ని పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు. కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓడూరు సెగ్మెంట్‌కు సంబంధించిన ఎంపీటీసీకి ఉప ఎన్నిక త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. ఇందుకు గాను ఓడూరు సెగ్మెంట్‌లో ఓడూరు, పున్నపువారిపాళెం, తీపనూరు, ఎగువరాజుపాళెం గ్రామాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆయన కోరారు. దీనిపై పార్టీల నుంచి అభ్యంతరాలు రాక పోవడంతో వారి అభిప్రాయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామనిటీ సందర్భంగా ఆయన అన్నారు. ఓడూరు ఎంపీటీసీ జనరల్ కేటగిరికి కేటాయించారని త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, సీపీఎం, పార్టీల అధ్యక్షులు అన్నంరెడ్డి పరంధామరెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, కార్తిక్, ముత్యాలయ్య, గుండాల లీలావతి, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు నాయుడుపేట క్రీడాకారులు



ప్రతిభ చూపిన క్రీడాకారులతో కోచ్ పవన్‌కుమార్

నాయుడుపేటటౌన్: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో నాయుడుపేటకు చెందిన పలువురు క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపి పథకాలు సాధించినట్లు తైక్వాండో ఏషియన్ కోచ్ యూ.పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో నాయుడుపేట నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. నెల్లూరు జిల్లాకు చెందిన జట్టులో పాల్గొని వివిధ విభాగాల్లో బాలబాలికలు పాల్గొని ప్రతిభ చూపి పతకాలను సాధించినట్లు కోచ్ తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు ఈనెల 10, 11,12 తేదీల్లో విజయనగరం ఎలమంచిలో జరగబోయే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. ప్రతిభ చూపిన వారిని పలువురు అభినందించారని పేర్కొన్నారు.

తైక్వాండోలో సూళ్లూరుపేట విద్యార్థిని ప్రతిభ



గోల్డ్ మెడల్ సాధించిన దేవిశ్రీ

సూళ్లూరుపేట: ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, క్యాడెట్ జిల్లాస్థాయి పోటీల్లో సబ్ జూనియర్ బాలికల విభాగంలో సూళ్లూరుపేట పట్టణానికి చెందిన ఆర్ దేవిశ్రీ నెల్లూరు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 6న నిర్వహించిన ఈ పోటీల్లో దేవిశ్రీ తన ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలవడం విశేషం. అయితే ఈనెల 10, 11, 12 తేదీల్లో విజయనగరం ఎలమంచిలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కూడా ఈ బాలిక ఎంపికైనట్టుగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు.

కల్యాణం..కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సైదాపురం: మండలంలోని కృష్ణారెడ్డిపల్లి సమీపం వైకుంఠపురంలో వెలసి ఉన్న మహావిష్ణువు, గోదాదేవి కల్యాణం పురస్కరించుకుని మంగళవారం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల సమక్షంలో ఘనంగా గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మోహినీ అలంకరణలో అలఘనాథుడు

గూడూరు: అలఘనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మోహినీ అలంకారంలో అలఘనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ప్రాకార ఉత్సవం మంగళవాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య

చిల్లకూరు: కుటుంబకలహాల కారణంగా ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ముత్యాలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. ముత్యాలపాడు గ్రామానికి చెందిన గెద్దెల మంజుల(36), వీరరాఘవయ్య దంపతులు. వీరి మధ్య తరచూ గొడవలు చోటుచేసుకునేవి. ఈక్రమంలో మనస్తాపం చెందిన మంజుల మంగళవారం ఇంట్లో శ్లాబ్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు